# నమస్తే ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 4 | సంచిక: 28 | పేజీలు: 4 | వెల: రూ.4/- | సోమవారం 28 సెప్టెంబర్ 2026 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


# జనగణన ప్రతి ఒక్కరి బాధ్యత

## మన్ కీ బాత్‌లో ప్రధాని మోడీ



### 2016 సర్జికల్ స్ట్రైక్స్‌ను గుర్తు చేసిన ప్రధాని

### ఉగ్రవాదానికి బలమైన, నిర్ణయాత్మక ప్రతిస్పందన తప్పదు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27 (నమస్తే ఉదయం)**


ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపుతామని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఉగ్రవాదం విషయంలో భారత్ జీరో టాలరెన్స్ విధానాన్ని పాటిస్తోందని తెలిపారు. ఉగ్రవాదానికి బలమైన, నిర్ణయాత్మక ప్రతిస్పందన ఉంటుందనే విషయాన్ని భారత్ స్పష్టం చేసిందని తెలిపారు. 2016 పాకిస్థాన్‌లో ఉగ్రశిబిరాలపై భారత సైన్యం జరిపిన సర్జికల్ స్ట్రైక్స్ అందుకు నిదర్శనమని అని అన్నారు. గాంధీ జయంతి వేళ స్వచ్ఛతకు సంబంధించి ఆయన ఇచ్చిన నినాదాన్ని ముందుకు తీసుకెళ్లాలని మోదీ, ప్రజలను కోరారు. 138వ 'మన్ కీ బాత్'లో భాగంగా దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఈ మేరకు మాట్లాడారు. భారత సైనికులు నియంత్రణ రేఖ దాటి ఉగ్రవాద స్థావరాలపై చర్యలు చేపట్టడం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైందని మోదీ అన్నారు. దేశం చాలా కాలంగా ఉగ్రదాడుల వల్ల ఎదుర్కొన్న బాధకు ఈ చర్య నిర్ణయాత్మక ప్రతిస్పందనగా నిలిచిందని పేర్కొన్నారు. పదేళ్ల క్రితం 2016లో చేపట్టిన సర్జికల్ స్ట్రైక్స్ ప్రపంచం ముందు భారత్ ఉగ్రవాద వ్యతిరేక విధానానికి ఒక కొత్త ఉదాహరణగా నిలిచాయని ఆయన పేర్కొన్నారు. 2016 సెప్టెంబర్ 18న జమ్మూకశ్మీర్‌లోని ఉరీలో ఆర్మీ శిబిరంపై ఉగ్రదాడి జరిగింది. ఈ దాడికి ప్రతిస్పందనగా సెప్టెంబర్ 28–29 రాత్రి నియంత్రణ రేఖ వెంబడి ఉగ్రవాదుల లాంచ్ ప్యాడ్‌లపై భారత సైన్యం సర్జికల్ స్ట్రైక్స్ నిర్వహించింది.

**జనగణనపై ప్రజలకు పిలుపు**

మన్ కీ బాత్'లో దేశవ్యాప్తంగా జరుగుతున్న జనగణన ప్రక్రియను కూడా ప్రధాని ప్రస్తావించారు. జనగణనను జాతీయ బాధ్యతగా అభివర్ణించారు. ప్రతి పౌరుడు ఇందులో భాగస్వామి కావాలని కోరారు. జనగణన సమయంలో అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ విధానాన్ని కూడా ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. దేశ జనాభా, సామాజిక–ఆర్థిక పరిస్థితులకు సంబంధించిన సమాచార సేకరణలో పౌరుల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు.

**డ్రగ్స్‌కు వ్యతిరేకంగా యువత**

దేశంలో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు యువత ముందుకు రావడాన్ని ప్రధాని ప్రశంసించారు. 'నషా ముక్త్ యువ అభియాన్' ద్వారా యువత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ డ్రగ్స్‌కు దూరంగా ఉండాలనే సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తోందన్నారు. యువత తమంతట తామే మాదకద్రవ్యాలకు ..మిగతా 2లో



# ప్రతి కుటుంబానికి 'ఇందిరమ్మ బీమా'

### ఐదు లక్షల బీమా అందజేయనున్నట్లు ప్రకటించిన భట్టి

### రైతులకు రుణమాఫీతో పాటు ఎకరాకు 12, సాయం

### కాంగ్రెస్ బూత్ లెవెల్ ఏజెంట్లే పార్టీకి మూల స్తంభాలు

### ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**మధిర సెప్టెంబర్ 27 (నమస్తే ఉదయం)**

కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బూత్ లెవెల్ ఏజెంట్లే (బిఎల్ఏలు) పార్టీకి నిజమైన మూలస్తంభాలని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం నాగులవంచ గ్రామంలో ఆదివారం నిర్వహించిన మండల కాంగ్రెస్ బిఎల్ఏల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామ స్థాయిలో కష్టపడే ప్రతి కార్యకర్త శ్రమకు తగిన గౌరవం లభిస్తుందని,ప్రభుత్వ పథకాలను ప్రతి ఇంటికి చేర్చి ప్రజా పాలనకు మంచి పేరు తీసుకురావాల్సిన బాధ్యత బిఎల్ఏలపైనే ఉందన్నారు.గత 10 ఏళ్లలో ప్రభుత్వం లేకపోవడం వల్ల మధిర నియోజకవర్గంలో అభివృద్ధి వెనుకబడిందని, కేవలం ఈ 5 ఏళ్ల కాలంలోనే కాలంతో పోటీ పడి పెండింగ్ పనులను పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. రాబోయే రెండేళ్లలో పాఠశాలలు, రోడ్లు, ఆసుపత్రులు వంటి అన్ని పనులను వేగవంతంగా పూర్తి చేసి నాయకులు గ్రామాల్లో తలఎత్తుకొని తిరిగేలా చేస్తామని స్పష్టం చేశారు.ఈ ..మిగతా 2లో

### మేడారం మినీ జాతర

# తేదీలు వచ్చేశాయ్..

### 4 రోజుల పాటు ఉత్సవాలు, పూర్తి షెడ్యూల్ ఇదే..!



**హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే ఉదయం)**

మేడారం సమ్మక్క–సారలమ్మ మినీ జాతర 2027 తేదీలు ఖరారు అయ్యాయి. ఫిబ్రవరి 17 నుంచి 20 వరకు 4 రోజుల పాటు మినీ జాతర నిర్వహించనున్నట్లు పూజారులు షెడ్యూల్ విడుదల చేశారు. ఫిబ్రవరి 17న సారలమ్మను గద్దెపైకి తీసుకురావడం, 18న సమ్మక్కను గద్దెపైకి తీసుకురావడం, 19న భక్తులు దర్శనాలు, మొక్కులు.. 20న జాతర ముగుస్తుంది. మహాజాతర లేని ఏడాదిలో జరిగే ఈ మినీ జాతరకు భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో అధికారులు దానికి సంబంధించిన ..మిగతా 2లో

# అక్టోబరు 12 నుంచి బ్రహ్మోత్సవాలు



### మూడేళ్లకోసారి అధికమాస

### కన్యకామాస ఉత్సవాలు

### వాహన సేవలకు బ్రహ్మోత్సవ విశిష్టత

**తిరుమల సెప్టెంబర్ 27 (నమస్తే ఉదయం)**

శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు అక్టోబరు 12 నుండి 20వ తేదీ వరకు వైభవంగా జరగనున్నాయి. చాంద్రమానం ప్రకారం ప్రతి మూడు సంవత్సరాలకోసారి అధికమాసం వస్తుంది. ఇలావచ్చిన సందర్భాల్లో కన్యామాసం(భాద్రపదం)లో వార్షిక బ్రహ్మోత్సవాలు, దసరా నవరాత్రుల్లో (ఆశ్వయుజం) నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణం, పెద్ద రథం, ధ్వజావరోహణం ఉండవు. ప్రతిరోజూ ఉదయం వాహనసేవ 8 నుండి 10 గంటల వరకు, రాత్రి వాహనసేవ 7 నుండి 9 గంటల వరకు జరుగుతుంది. గరుడవాహనసేవ రాత్రి 6.30 నుండి 11.30 గంటల వరకు జరుగుతుంది. ఈ బ్రహ్మోత్సవాల్లో వాహనసేవల వైశిష్ట్యం ఇలా ఉంది.

**వాహన సేవల వివరాలు**

అక్టోబరు 11 -- అంకురార్పణం -- రాత్రి 7 నుండి 9 గంటల వరకు

అక్టోబరు 12 -- బంగారు తిరుచ్చి ఉత్సవం -- ఉదయం 9 గంటలకు ..మిగతా 2లో

# సిరిసిల్లలో బిఆర్ఎస్ కబ్జాలపై...

# శ్వేత పత్రానికి డిమాండ్

### బిఆర్ఎస్ నేతలు ఎనిమిది వేల ఎకరాలు కబ్జా చేశారని అసెంబ్లీలో ప్రకటించిన రేవంత్

### జిల్లాలో కేవలం 1,272 ఎకరాల భూ పంపిణీ

### సిరిసిల్లలో 204 ఎకరాలు మాత్రమేనని స్పష్టం చేసిన కేటీఆర్

### అందులో 2,400 ఎకరాలు రికవరీ చేశామన్న వాటి వివరాలు వెల్లడించాలి

### నేతన్నల బకాయిలు చెల్లించి, నిలిచిన పథకాలు పునరుద్ధరించాలి


### రైతు బంధు, రుణమాఫీ హామీల అమలుపై స్పష్టత ఇవ్వాలి

### కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు తేదీలను ప్రకటించాలని నిలదీత



**హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే ఉదయం)**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దాదాపు మూడేళ్ల తర్వాత తొలిసారిగా సిరిసిల్ల నియోజకవర్గానికి వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, స్థానిక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నలతో స్వాగతం పలికారు. కేవలం రాజకీయ విమర్శలు, వ్యక్తిగత దూషణలకు పరిమితం కాకుండా, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు, ప్రభుత్వం ఇచ్చిన హామీలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ సుదీర్ఘమైన బహిరంగ లేఖను విడుదల చేశారు.అసెంబ్లీలో సీఎం చేసిన ఆరోపణలను ..మిగతా 2లో




# బ్యాంకు ఉద్యోగుల సమ్మె వాయిదా

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27 (నమస్తే ఉదయం)**

ప్రభుత్వ రంగ బ్యాంకుల ఉద్యోగులు ఈ నెల 28, 29, 30 తేదీల్లో మూడు రోజులపాటు నిర్వహించాల్సిన సమ్మె వాయిదా పడింది. ఐబీఐ, యూఎఫ్‌బీయూ మధ్య ఆదివారం సమావేశం జరిగింది. చర్చలు ఫలించడంతో బ్యాంకు యూనియన్లు సమ్మె విరమణ ప్రకటన చేశాయి. శనివారాల సెలవు డిమాండ్‌పై ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. సమ్మె వాయిదా పడడంతో సోమవారం నుంచి బ్యాంకులు యథావిధిగా పనిచేస్తాయి.




# దేశంలో తొలి ఎల్ఎన్‌జీ రైలు

### 40 శాతం డీజిల్ ను తగ్గించే టెక్నాలజీ

### సబర్మతిలో ప్రారంభించిన అమిత్ షా

### దేశంలో తొలిసారిగా పరుగులు తీసిన ఎల్ఎన్‌జీ రైలు

2లో..

### సబర్మతిలో ప్రారంభించిన కేంద్ర మంత్రి అమిత్ షా

### భారీగా ఆదా కానున్న ఇంధన ఖర్చు, తగ్గనున్న కాలుష్యం

### ఈ పర్యటనలో రూ.1542 కోట్లకు పైగా రైల్వే ప్రాజెక్టులకు శ్రీకారం

# జనగణన ప్రతి ఒక్కరి బాధ్యత

**మొదటి పేజీ తరువాయి...**

దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేయడంతో పాటు, ఇతరులను కూడా ఆ దిశగా ప్రోత్సహిస్తున్నారని మోదీ చెప్పారు. 'నషా ముక్త్ యువా ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమంలో దేశవ్యాప్తంగా యువత భాగస్వామ్యం పెరుగుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఇటీవల వెల్లడించింది.

**మోధేరా గ్రామం ప్రస్తావన**

గుజరాత్‌లోని చారిత్రాత్మక మోధేరా సూర్య దేవాలయం వెయ్యేళ్ల ప్రస్థానాన్ని ప్రధాని మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. విదేశీ దండయాత్రల సమయంలో ఈ ఆలయం ఎదుర్కొన్న విధ్వంసాన్ని, ఆ తర్వాత జరిగిన పునర్నిర్మాణాన్ని గుర్తు చేసుకున్నారు. అదే సమయంలో, ఈ గ్రామం దేశంలోనే మొట్టమొదటి 24x7 సోలార్ విలేజ్‌గా మారడాన్ని ఆయన అభినందించారు.

అలాగే మోధేరాలో పర్యాటకుల కోసం అనేక వసతులను పెంచినట్లు ప్రధాని తెలిపారు. ఏటా జనవరిలో మకర సంక్రాంతి తర్వాత ఇక్కడ జరిగే 'మోధేరా నృత్య ఉత్సవం'లో భారతీయ శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా



నిలుస్తాయన్నారు. భారతీయులందరూ జీవితంలో ఒక్కసారైనా మోధేరాను సందర్శించాలని ఆయన కోరారు.

మధ్యప్రదేశ్‌లో ఓ యువకుడు నది పరిశుభ్రత చేపడితే సమాజం మొత్తం అండగా నిలిచిందని ప్రధాని మోదీ చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా పురాతన బావులు, కోనేరులకు పునర్ వైభవం తీసుకొచ్చే దిశగా పరిశుభ్రత కార్యక్రమాలు జరుగుతున్నాయని వెల్లడించారు. దిల్లీలో యువత పొడి, తడి చెత్తను వేర్వేరుగా సేకరించే కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. జనగణన కార్యక్రమాన్ని బాధ్యతగా తీసుకొని ప్రతి పౌరుడు అందులో పాల్గొనాలని మోదీ పిలుపునిచ్చారు.

**అశోక్ సింఘాల్‌కు నివాళి**

విశ్వ హిందూ పరిషత్ మాజీ నేత అశోక్ సింఘాల్ జయంతి సందర్భంగా ప్రధాని మోదీ ఆయనను స్మరించుకున్నారు. సమాజంలో ఉంటూనే సన్యాసిలా జీవితం గడిపారని పేర్కొన్నారు. రామజన్మభూమి ఉద్యమానికి సింఘాల్ అందించిన దిశ, అందులో ఆయన నింపిన శక్తిని మోదీ ప్రస్తావించారు. అయోధ్యలో నిర్మితమైన రామ మందిరాన్ని ఆయన కృషికి ఫలితంగా అభివర్ణించారు.



## 12 నుంచి బ్రహ్మోత్సవాలు

**మొదటి పేజీ తరువాయి...**

పెద్దశేష వాహనం -- రాత్రి 7 గంటలకు
అక్టోబరు 13 -- చిన్నశేష వాహనం -- ఉదయం 8 గంటలకు
హంస వాహనం -- రాత్రి 7 గంటలకు
అక్టోబరు 14 -- సింహ వాహనం -- ఉదయం 8 గంటలకు
ముత్యపుపందిరి వాహనం -- రాత్రి 7 గంటలకు
అక్టోబరు 15 -- కల్పవృక్ష వాహనం -- ఉదయం 8 గంటలకు
సర్వభూపాల వాహనం -- రాత్రి 7 గంటలకు
అక్టోబరు 16 -- మోహినీ అవతారం -- ఉదయం 8 గంటలకు
గరుడ వాహనం -- సాయంత్రం 6.30 గంటలకు
అక్టోబరు 17 -- హనుమంత వాహనం -- ఉదయం 8 గంటలకు
పుష్పక విమానం -- సాయంత్రం 4 గంటలకు
గజ వాహనం -- రాత్రి 7 గంటలకు
అక్టోబరు 18 -- సూర్యప్రభ వాహనం -- ఉదయం 8 గంటలకు
చంద్రప్రభ వాహనం -- రాత్రి 7 గంటలకు
అక్టోబరు 19 -- స్వర్ణరథం -- ఉదయం 7 గంటలకు
అశ్వ వాహనం -- రాత్రి 7 గంటలకు
అక్టోబరు 20 -- చక్రస్నానం -- ఉదయం 6 గంటలకు



## మేడారం మినీ జాతర
## తేదీలు వచ్చేశాయ్..

**మొదటి పేజీ తరువాయి...**

ఏర్పాట్లు చేయనున్నారు.

**మేడారం మినీ జాతర 2027 షెడ్యూల్ విడుదల**

తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన మేడారం సమ్మక్క-సారలమ్మ మినీ జాతరకు సంబంధించి వచ్చే ఏడాది షెడ్యూల్ విడుదలైంది. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం గ్రామంలో 2027 ఫిబ్రవరి నెలలో నాలుగు రోజుల పాటు మినీ జాతర నిర్వహించనున్నట్లు సమ్మక్క-సారలమ్మ పూజారుల సంఘం ప్రకటించింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 17వ వతేదీ నుంచి 20వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయని పేర్కొంది. మేడారం మినీ జాతర తేదీలను పూజారుల సంఘం తాజాగా అధికారికంగా ప్రకటించింది. ఈ వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి కూడా తెలియజేసింది. మినీ జాతర సందర్భంగా సమ్మక్క-సారలమ్మ అమ్మవార్లను సంప్రదాయబద్ధంగా గద్దెలపైకి తీసుకొచ్చి పూజలు నిర్వహించనున్నారు.

మినీ జాతరలో నాలుగు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పూజారులు వెల్లడించిన షెడ్యూల్ ప్రకారం.. తొలిరోజైన ఫిబ్రవరి 17వ తేదీన మేడారం మినీ జాతర ప్రారంభం కానుంది. తొలి రోజు సారలమ్మను గద్దెపైకి తీసుకురానున్నారు. సంప్రదాయ పూజా కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభించనున్నారు. ఇక రెండో రోజైన ఫిబ్రవరి 18వ తేదీన సమ్మక్కను గద్దెపైకి తీసుకురానున్నారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు మేడారం చేరుకుని అమ్మవార్లను దర్శించుకునే అవకాశం ఉంది.

## సిరిసిల్లలో బిఆర్ఎస్ కబ్జాలపై... శ్వేత పత్రానికి డిమాండ్

**మొదటి పేజీ తరువాయి...**

ప్రస్తావిస్తూ, సిరిసిల్లలో బీఆర్ఎస్ నేతలు 8 వేల ఎకరాల భూమిని దోచుకున్నారని, అందులో 2,400 ఎకరాలు స్వాధీనం చేసుకున్నామని చెప్పడం నిరాధారమని కేటీఆర్ అన్నారు. 2014 నుంచి 2023 వరకు జిల్లాలో కేవలం 1,272 ఎకరాల భూ పంపిణీ జరిగిందని, అందులో సిరిసిల్ల నియోజకవర్గంలో 204 ఎకరాలు మాత్రమేనని స్పష్టం చేశారు. "ఆ 8 వేల ఎకరాల భూమి ఎక్కడుంది స్వాధీనం చేసుకున్న 2,400 ఎకరాలు ఏ మండలం, ఏ గ్రామం, ఏ సర్వే నంబర్‌లో ఉన్నాయి,ఆ వివరాలతో తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలి. రుజువు చేయలేకపోతే సిరిసిల్ల ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

**నేతన్నల బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారు.**

బీఆర్ఎస్ హయాంలో బతుకమ్మ చీరలు, స్కూల్ యూనిఫాంలు, ఇతర ప్రభుత్వ ఆర్డర్లతో నేతన్నలకు రూ.3,313 కోట్ల విలువైన పని కల్పించి, వారి ఆదాయాన్ని రూ.20 వేలకు పెంచామని కేటీఆర్ గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బతుకమ్మ చీరల పథకాన్ని నిలిపివేసి, ఇతర ఆర్డర్లను దళారులకు కట్టబెట్టి నేతన్నల ఉపాధిని దెబ్బతీసిందని ఆరోపించారు.

"నేతన్నల బకాయిలు రూ.60 కోట్లు ఎప్పుడు చెల్లిస్తారు? నిలిపివేసిన 10 శాతం యార్న్ సబ్సిడీ, రూ.5 లక్షల నేతన్న బీమా ఎప్పుడు పునరుద్ధరిస్తారు తేదీలు ప్రకటించాలని ప్రశ్నించారు. వీవింగ్ పార్క్, అపరెల్ పార్క్ ప్రారంభించి కార్మికులను యజమానులుగా మార్చే ప్రణాళికలను ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని నిలదీశారు.

**రైతన్నకు ఇచ్చిన మాట ఏమైంది**

రైతుబంధును రూ.15 వేలకు పెంచుతామని, కౌలు రైతులకు కూడా ఇస్తామని హామీ ఇచ్చి ఎందుకు అమలు చేయడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. "ఎగ్గొట్టిన రైతుబంధు బకాయిలు, రూ.2 లక్షల రుణమాఫీ సంపూర్ణ అమలు, నిలిచిపోయిన రైతుబీమా పునరుద్ధరణ ఎప్పుడు చేస్తారు. స్పష్టమైన తేదీలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో రూ.1,604 కోట్లతో చేపట్టిన మల్కపేట రిజర్వాయర్ నుంచి అప్పర్ మానేరుకు నీటిని ఎప్పుడు తరలిస్తారో చెప్పాలన్నారు.

అభివృద్ధి, విద్య, సంక్షేమంపై ప్రశ్నల వర్షం

బీఆర్ఎస్ హయాంలో సిరిసిల్లను ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చామని, రూ.400 కోట్లతో మంజూరైన జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కాలేజీకి నిధులు ఎందుకు విడుదల చేయడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. రూ.1,564 కోట్లతో సిరిసిల్ల పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన రూ.40 కోట్ల బకాయిలు విడుదల చేయాలని కోరారు.

ఆసరా పెన్షన్లను రూ.4 వేలకు ఎప్పుడు పెంచుతారని, 33 నెలలుగా మహిళలకు బాకీ ఉన్న రూ.82,500 మహాలక్ష్మి సాయం, కల్యాణలక్ష్మి తులం బంగారం హామీ ఏమైందని నిలదీశారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యార్థినులకు స్కూటీలు, ఆటో డ్రైవర్లకు రూ.12 వేల సాయం వంటి హామీల అమలుపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చే హామీ, నిలిపివేసిన గొర్రెల పంపిణీ, చేపపిల్లల పంపిణీ, దళితబంధు, బీసీబంధు పథకాలను ఎప్పుడు పునరుద్ధరిస్తారో చెప్పాలని కోరారు. చైతన్యానికి ప్రతీక అయిన సిరిసిల్ల గడ్డపైకి వస్తున్న ముఖ్యమంత్రి, ప్రజల పక్షాన తాము లేవనెత్తిన ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం చెప్పి, తన పర్యటనకు సార్థకత చేకూర్చాలని కేటీఆర్ తన లేఖలో పేర్కొన్నారు.

## ప్రపంచ టూరిజం డెస్టినేషన్‌గా తెలంగాణ

### పెట్టుబడులకు కొత్త పాలసీ..

### సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన

**హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే ఉదయం)**

వరల్డ్ టూరిజం డే సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. తెలంగాణలోని చారిత్రక కట్టడాలు, దేవాలయాలు, కోటలు, జలపాతాలు, అడవులు, వన్యప్రాణి ప్రాంతాలు, జానపద కళలు, పండుగలను ప్రపంచ పర్యాటక పటంలో మరింతగా పరిచయం చేయాలని తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. రామప్ప, వరంగల్, యాదాద్రి, భద్రాద్రి, అలంపూర్, మేడారం, హైదరాబాద్ హెరిటేజ్ ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. టూరిజం పాలసీ 2025-30 ద్వారా పెట్టుబడులను ఆకర్షిస్తూ ఎకో, టెంపుల్, మెడికల్, హెరిటేజ్, అడ్వెంచర్ టూరిజాన్ని ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు.ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రజలకు, రాష్ట్రాన్ని సందర్శిస్తున్న దేశ, విదేశీ పర్యాటకులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణలోని సహజ, సాంస్కృతిక, చారిత్రక, ఆధ్యాత్మిక ప్రత్యేకతలను ప్రపంచానికి మరింతగా పరిచయం చేయడంతో పాటు రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయి పర్యాటక గమ్యస్థానంగా అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణకు అనేక రకాల పర్యాటక ఆకర్షణలు ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.చారిత్రక కట్టడాలు, పురాతన దేవాలయాలు, కోటలు, జలపాతాలు, అడవులు, వన్యప్రాణి అభయారణ్యాలు, చెరువులు, జానపద కళలు, సంప్రదాయ పండుగలు తెలంగాణ రాష్ట్ర ప్రత్యేకతను చాటుతున్నాయని తెలిపారు. ఈ ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేసి మరింత మంది దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. తెలంగాణలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.



## ప్రతి కుటుంబానికి 'ఇందిరమ్మ బీమా'

**మొదటి పేజీ తరువాయి...**

సందర్భంగా ప్రజా సంక్షేమ పథకాలను ఆయన వివరించారు. రాష్ట్రంలో కోటి 6 లక్షల కుటుంబాలకు నెలకు 6 కేజీల చొప్పున ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు డ్వాక్రా రుణాల పునరుద్ధరణ చేపడుతున్నామన్నారు.గృహ జ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 10 లక్షలకు పెంచామని చెప్పారు. నవంబర్ 19న ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల బీమా కల్పించే 'ఇందిరమ్మ ధీమా' పథకాన్ని ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా అల్పాహారం,పాలు, రాగిజావ అందిస్తున్నామని, ప్రతి నియోజకవర్గంలో అంతర్జాతీయ ప్రమాణాలతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్'ను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఇదే పర్యటనలో భాగంగా చింతకాని మండల కేంద్రంలో పర్యాటక రంగానికి పెద్దపీట వేసేలా కీలక అభివృద్ధి పనులకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శ్రీకారం చుట్టారు. మండల కేంద్రంలోని చెరువు వద్ద పర్యాటక వసతుల కల్పన పనులకు శంకుస్థాపన చేసి, మౌలిక వసతుల డిజైన్లను పరిశీలించారు.సందర్శకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆధునిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అలాగే,నరసింహాపురం ఎస్సీ కాలనీలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు.కాలనీ వాసుల దీర్ఘకాలిక సమస్యను పరిష్కరిస్తూ నాణ్యమైన రోడ్లను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్,టీపీసీసీ పరిశీలకులు దుద్దిళ్ల శ్రీను బాబు,డీసీసీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## దేశంలో తొలి ఎల్ఎన్‌జీ రైలు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27 (నమస్తే ఉదయం)**

భారత రైల్వే చరిత్రలో ఒక నూతన అధ్యాయం ప్రారంభమైంది. దేశంలోనే తొలిసారిగా ద్రవీకృత సహజ వాయువు ఇంధనంతో నడిచే రైలును కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా, గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ ఆదివారం సబర్మతిలో జెండా ఊపి ప్రారంభించారు. రైల్వే కార్యకలాపాల్లో డీజిల్‌కు ప్రత్యామ్నాయంగా ఎల్ఎన్‌జీ వాడకానికి ఈ కార్యక్రమం శ్రీకారం చుట్టింది. సాంప్రదాయ డీజిల్ ఇంధనంపై ఆధారపడటాన్ని తగ్గించి, ప్రత్యామ్నాయ ఇంధన వనరులను ప్రోత్సహించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. ఇందుకోసం డ్రైవింగ్ పవర్ కార్స్ ఇంజిన్లను డీజిల్-ప్లస్-ఎల్ఎన్‌జీ డ్యూయల్-ఫ్యూయల్ సిస్టమ్‌గా అభివృద్ధి చేశారు. సబర్మతి ఇంటిగ్రేటెడ్ కోచింగ్ డిపోలో 1,400 హార్స్‌పవర్ సామర్థ్యం గల రెండు డీపీసీలను ఈ కొత్త విధానానికి మార్చారు. ఈ టెక్నాలజీ పనితీరును నిర్ధారించుకునేందుకు, మార్పిడి చేసిన రెండు డీపీసీలపై 2,000 కిలోమీటర్లకు పైగా ఫీల్డ్ ట్రయల్స్ విజయవంతంగా పూర్తి చేశారు.రైల్వే శాఖ విడుదల చేసిన ట్రయల్ డేటా ప్రకారం, ఈ డ్యూయల్-ఫ్యూయల్ సిస్టమ్ ద్వారా డీజిల్ వాడకాన్ని 40 శాతం వరకు తగ్గించవచ్చు. దీనివల్ల ఇంధన ఖర్చు గణనీయంగా ఆదా అవ్వడంతో పాటు కార్బన్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్ల వంటి కాలుష్య కారకాల ఉద్గారాలు కూడా తగ్గుతాయి. ఒక డీపీసీపై ఏటా రూ.11.9 లక్షలు, ఎనిమిది కోచ్‌ల రైలుపై సుమారు రూ.23.9 లక్షల వరకు ఆదా అవుతుందని రైల్వే శాఖ అంచనా వేసింది.ప్రతి డీపీసీలో 2,200 లీటర్ల సామర్థ్యంతో కూడిన ఎల్ఎన్‌జీ ట్యాంకును అమర్చారు. ఇందులో 850-900 కిలోల వరకు ఎల్ఎన్‌జీని నింపవచ్చు. ఒక్కసారి ట్యాంకును పూర్తిగా నింపితే రైలు సుమారు 1,600 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుంది.ఈ పర్యటనలో భాగంగా అమిత్ షా రూ.1,542 కోట్లకు పైగా విలువైన పలు రైల్వే ప్రాజెక్టులను ప్రారంభించారు. ఇందులో భాగంగా సబర్మతిలో రూ.700 కోట్లతో నిర్మించిన లోకోమోటివ్ నిర్వహణ షెడ్‌ను ప్రారంభించి, ఒక ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌ను జెండా ఊపి పంపించారు. వీటితో పాటు అహ్మదాబాద్- పాలన్‌పూర్, అహ్మదాబాద్-సమఖియాలీ సెక్షన్లలో దేశీయ పరిజ్ఞానంతో తయారైన 'కవచ్' రైలు రక్షణ వ్యవస్థను, రెండు రైల్వే సెక్షన్లలో ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థను, సబర్మతి-సర్ఖేజ్ సెక్షన్ డబ్లింగ్ పనులను కూడా ప్రారంభించారు. రైలు పనితీరుకు ఎలాంటి ఆటంకం లేకుండా ఖర్చులను, కాలుష్యాన్ని తగ్గించేందుకు రైల్వే శాఖ చేస్తున్న ప్రయోగాలకు ఈ ఎల్ఎన్‌జీ రైలు నిదర్శనంగా నిలుస్తోంది.

## తెలంగాణలో ULC పెండింగ్ దరఖాస్తులకు మోక్షం

### దశాబ్దాల భూ సమస్యలపై సర్కారు ఫోకస్

### తెలంగాణలో 22ఏ భూములపై హై లెవల్ కమిటీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే ఉదయం)**

రాష్ట్రంలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారంపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించింది. అర్బన్ ల్యాండ్ సీలింగ్ కింద పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న దరఖాస్తులను పరిశీలించి, అర్హమైన కేసులను నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరించాలని నిర్ణయించింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కీలక ప్రకటన విడుదల చేశారు. దశాబ్దాలుగా పరిష్కారం కాకుండా ఉన్న భూ వివాదాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు వెల్లడించారు. ఖూజ పెండింగ్ దరఖాస్తులకు సంబంధించి గతంలో జారీ చేసిన ఉత్తర్వుల అమలులో జాప్యం జరిగిందని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. 2016లో జీవోలు జారీ చేసినప్పటికీ అప్పట్లో వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడంతో వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉండిపోయాయని తెలిపారు.

# రాజేంద్రనగర్ నియోజకవర్గంలో కొండ లక్ష్మణ్ బాపూజీ 111 జయంతి వేడుకలు



పద్మశాలి ట్రస్ట్ భవన్ లో కొండ లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు ఎర్వ సత్యనారాయణ, తదితరులు



కొండ లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు ఉస్కేమూరి విజయ్ కుమార్ తదితరులు

**బుద్వేల్, సెప్టెంబరు 27 (నమస్తే ఉదయం):**

తెలంగాణ రాష్ట్రం కోసం తన మంత్రి పదవి నే త్యాగం చేసిన మహనీయులు కొండా లక్ష్మణ్ బాపూజీ అని పద్మశాలి సంఘం రంగారెడ్డి జిల్లా నాయకులు యు విజయ్ కుమార్ అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ఆదివారం కాటేదాన్ లోని పద్మశాలి ట్రస్టు భవనంలో నిర్వహించిన జయంతి వేడుకలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కొండా లక్ష్మణ్ ఆశయాలను ముందుకు తీసుకువెళతామన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్యామల యాదగిరి, శేఖర్, వెంకటేశ్, రవి, బండారి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

**వ్యవసాయ విశ్వవిద్యాలయంలో..**

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో ఆదివారం జరిగిన కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జీఈసీహెచ్ విద్యా సాగర్ ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో వర్సిటీ జాయింట్ రిజిస్ట్రార్ డి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

**భావన రుషి నగర్‌లోని శ్రీ మార్కండేయ పద్మశాలి ట్రస్ట్ భవనంలో .**

ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు ఎర్వ సత్యనారాయణ మాట్లాడుతూ...




ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం లో కొండ లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న రిజిస్ట్రార్ డాక్టర్ జీ ఈ సి హెచ్ విద్యా సాగర్

తెలంగాణ సాధన కోసం, పద్మశాలి సంఘం అభివృద్ధి కోసం ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. సామాజిక అభివృద్ధి, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయక మన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం లో తెలంగాణ పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు కార్యదర్శి యాదగిరి, నాయకులు దొంత రాజు, బండారి యాదగిరి, బిర్రు రాధాకిషన్, కొంపల్లి జగదీష్, ముంగపాటి విష్ణు, రాపోల్ సత్తయ్య, సామల యాదగిరి, నోముల శేఖర్, కోట శ్యామ్, ఎర్వ కుమారస్వామి, శ్రీరాందాస్ నరేందర్, తిరందాసు ప్రభాకర్, మల్లేష్, పులి లక్ష్మణ్ ప్రసాద్, రెబ ప్రవీణ్, గోంత్యాల శ్రీనివాస్, వాడిగాచర్ల మల్లేష్, దశపతి బిక్షపతి, దశపతి రాజు తదితరులు పాల్గొన్నారు.



శివరాంపల్లి కి చెందిన దాసరి జంగమ్మ చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి వివేక్ వెంకట స్వామి



దాసరి జంగమ్మ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

# స్వర్గీయ దాసరి జంగమ్మకు ఘన నివాళులు

## పాల్గొన్న మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి.. ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్‌లు

**బుద్వేల్, సెప్టెంబరు 27 (నమస్తే ఉదయం)**

ఇటీవల మరణించిన దాసరి జంగమ్మ కు తెలంగాణ రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి తో పాటు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్, ఇతర నాయకులు నివాళులు అర్పించారు. ఆదివారం శివరాంపల్లి ప్రజా భవన్ లో జరిగిన సంతాప సభలో వారు పాల్గొన్నారు. బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల కమిటీ అధ్యక్షులు, విశ్రాంత ఎస్ ఐ దాసరి రమేష్ కు మాతృ మూర్తి అయిన దాసరి జంగమ్మ కష్టపడే మనస్తత్వం కల వ్యక్తి అని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్వర్గీయ దాసరి జంగమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. దాసరి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. గుండె ధైర్యంతో ఉండాలని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. ఆమె కుటుంబం అభివృద్ధికి చేసిన సేవలు ఎనలేని గుర్తు చేశారు. తన పిల్లలను సత్ప్రవర్తనతో, ఉన్నతమైన విలువలతో పెంచి, మంచి కుటుంబ విలువలను వారికి అందించిన విధానాన్ని కొనియాడారు. జంగమ్మ గారు తన జీవితంలో పాటించిన క్రమశిక్షణ, నిజాయితీ, కష్టపడి పనిచేసే స్వభావం కుటుంబ సభ్యులకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆమె కుటుంబ సభ్యులు దాసరి రమేష్, దాసరి సత్యనారాయణ కుటుంబ సభ్యులతో పాటు స్థానిక నాయకులు పడమటి శ్రీధర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, మోహన్ రావు, పంబాల రాజు , పత్యార నరసింహ ఇతర బంధుమిత్రులు పాల్గొన్నారు.

# తాళ్లకుంటలో హార్ట్ డే

## అత్యవసర చికిత్స పై ప్రజలకు అవగాహన కల్పించిన డాక్టర్లు

**బుద్వేల్, సెప్టెంబరు 27 (నమస్తే ఉదయం):**

అత్తాపూర్ సర్కిల్ పెద్ద తాళ్ల కుంట వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ఉచిత వైద్య శిభిరం నిర్వహించారు. మైత్రి ఆసుపత్రి డాక్టర్ల సహకారంతో నిర్వహించిన ఈ శిభిరంలో గుండెపోటు వస్తే అత్యవసర చికిత్స ఎలా అందించాలి. ఏ విదంగా సీపీఆర్ చేయాలి అనే విషయాలను మైత్రి ఆసుపత్రి సీనియర్ కార్డియాలజిస్ట్ వైద్యులు డాక్టర్ సాదిక్ ఆజాం, రంగా శ్రీకాంత్ ప్రజలకు, వాకర్స్ కు వివరిం చారు. ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరై ఉచిత వైద్య పరీక్షలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు బర్ల



హార్ట్ డే లో పాల్గొన్న వాకర్స్, లీడర్స్



సీ పీ ఆర్ గురించి అవగాహన కల్పిస్తున్న డాక్టర్లు

జంగయ్య, దుర్గాదాస్, మల్లికార్జున్ రెడ్డి, కొండమీది హరినాద్, రాజకీయ పార్టీల నాయకులు కొలన్ సుభాష్ రెడ్డి, నారగూడెం మల్లారెడ్డి, షాబాద్ విజయ్కుమార్, పోరెడ్డి ధర్మారెడ్డి, సీనియర్ పాత్రికేయులు మ్యాడం మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉన్న ప్రతి డ్రైవర్‌కు ప్రభుత్వం రూ. 50 లక్షల భీమా సౌకర్యం కల్పించాలి

## టీడీపీ నేత యు విజయ్ కుమార్

**బుద్వేల్, సెప్టెంబరు 27 (నమస్తే ఉదయం)**

డ్రైవర్ల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని వారికి మేలుకరమైన నిర్ణయాలు తీసుకోవాలని టీ టీడీపీ మైలార్దేవుపల్లి డివిజన్ నాయకులు యు విజయ్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. కాటేదాన్ ఆటో స్టాండ్ నాయకులతో ఆదివారం ఆయన సమావేశమైనారు. డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రమాదాలు, అనారోగ్యం, వృద్ధాప్యం, సహజ మరణాలు సంబవించినప్పుడు డ్రైవర్ల కుటుంబాలు చిన్నా భిన్నం అయిపోతున్నాయన్నారు. అలా కాకుండ ఉండాలంటే తెలంగాణ లో డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన ప్రతి డ్రైవర్ కు రూ.50 లక్షల ప్రభుత్వ భీమా కల్పించాలన్నారు. డ్రైవర్



డ్రైవర్‌లతో సమావేశమైన టీడీపీ నాయకులు ఉస్కేమూరి విజయ్ కుమార్

తో పాటు అతని కుటుంబ సభ్యులకు అనారోగ్యం వచ్చినప్పుడు డ్రైవర్ లైసెన్సు ఆధారంగా ప్రభుత్వ పరంగా ఆరోగ్య రక్షణ, వైద్య సహాయం అందించాలన్నారు. 30 నుంచి 40 సంవత్సరాలు కష్టపడి పనిచేసిన డ్రైవర్ సహజ మరణం పొందిన సం దర్భంలో అతని కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో పడకుండ డ్రైవింగ్ లైసెన్సు ఆధారంగా ప్రభుత్వం రూ. 20 లక్షలు ఆర్థిక సహాయం అందించాలన్నారు. డ్రైవర్లు కేవలం వాహనాలు నడిపే వ్యక్తులే కాదని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో, ప్రజల రవాణాలో, సరుకు రవాణ లో ప్రతి రోజు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. వారి కష్టానికి తగిన గౌరవం, భద్రత, ఆరోగ్య రక్షణ, కుటుంబ ఆర్థిక భరోసా ను ప్రభుత్వం కల్పించాలన్నారు. ఈ డిమాండ్ లపై రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలో ఉన్న డ్రైవర్ల ను ఏకతాటిపైకి తీసుకువచ్చి పోరాటం చేస్తామన్నారు. అందుకోసం త్వరలోనే తెలంగాణ రాష్ట్రంలో డ్రైవర్ల సంక్షేమ సంఘం ఏర్పాటు చేసుకుని ముందుకు సాగుదాం అన్నారు.



శ్రీ పాండురగ, రుక్మిణి అమ్మ వార్ల ఊరేగింపు

# ప్రజలందరు చల్లంగా ఉండాలి: ఎస్ వెంకటేశ్

**బుద్వేల్, సెప్టెంబరు 27 (నమస్తే ఉదయం):**

కాటేదాన్ బాబుల్ రెడ్డి నగర్ లోని శ్రీ పాండురంగ రుక్మిణీ సమేత దేవాలయంలో ఆదివారం స్వామి వారి పల్లకి సేవ, కళ్యాణ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేధ మంత్రోచ్చరణల మధ్య స్వామి వారి కళ్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలలో బీఆర్ఎస్ కాటేదాన్ డివిజన్ అధ్యక్షులు ఎస్ వెంకటేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కలియుగంలో భక్తుల కోరికలు తీర్చే ప్రత్యక్ష దైవం శ్రీ పాండురంగ స్వామి అని గుర్తు చేశారు. పల్లకి సేవ లో పాల్గొన్న ఆయన ప్రజలందరు క్షేమంగా ఉండాలని భగవంతుణ్ణి ప్రార్థించారు.

# అత్తాపూర్‌లో భారీ చోరీ

## రూ.23 లక్షల నగదు, ఐదు తులాల బంగారం అపహరణ

**బుద్వేల్, సెప్టెంబర్ 27 (నమస్తే ఉదయం) :**

అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హసన్‌నగర్‌లో దొంగలు ఓ వ్యాపారి ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. వ్యాపారి అమిత్ శనివారం రాత్రి 9 గంటల సమయంలో షేక్‌పేటలోని ఓ ఫంక్షన్‌కు వెళ్లారు. అర్ధ రాత్రి ఇంటికి తిరిగి వచ్చేసరికి ప్రధాన ద్వారం తాళం పగులగొట్టి ఉండటాన్ని గుర్తించారు. ఇంట్లోకి వెళ్లి చూడగా అల్మారాలో ఉంచిన రూ.23 లక్షల నగదు, ఐదు తులాల బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇల్లు కొనుగోలు చేసేందుకు రూ.23 లక్షల నగదును ఇంట్లో భద్రపరిచినట్లు బాధితుడు పోలీసులకు తెలిపినట్లు సమాచారం. కేసు నమోదు చేసుకున్న అత్తాపూర్ పోలీసులు పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తూ దర్యాప్తు చేస్తున్నారు.



రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1996-97 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు , ఉపాధ్యాయినీలు

# పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

## 29 సంవత్సరాల తర్వాత కలుసుకుని మధుర జ్ఞాపకాలను పంచుకున్న చిన్న నాటి మిత్రులు

**బుద్వేల్, సెప్టెంబరు 27 (నమస్తే ఉదయం)**

రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 29 సం వత్సరాల క్రితం 1996-97వ విద్యా సంవత్సరంలో 10 తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. బుద్వేల్ లోని ఎస్ఎన్ఆర్ బంకెట్ హాల్ లో జరిగిన ఈ కార్యక్రమ ంలో చిన్న నాడు కలసి చదువుకున్న విద్యార్థులందరు మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. తమ కు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయినీ లు ఉమాదేవి, సునేత్రీ లను ఘనంగా సన్మానించి పాదాభివందనాలు చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయినీలు ఉమాదేవి, సునేత్రి లు మాట్లాడుతూ, 29 సంవత్సరాల క్రితం తమ వద్ద విధ్యాబుద్ధులు నేర్చుకున్న విద్యార్థులు తమను మరిచి పోకుండ పిలిచి సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. సమాజంలో మంచి పేరు ప్రతిష్టలు తెచ్చుకునేలా జీవించాలన్నారు. తల్లిదండ్రులను, పెద్దలను గౌరవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రామక్రిష్ణ, అప్పారెడ్డిగూడెం మహేందర్, ఎం శ్రీనివాస్, ప్రవీణ్ , దినేష్, వేముల శేఖర్, పి శ్రీశైలం, కోరని నరేందర్, ఎం ప్రవీణ్ కుమార్, జూనియర్స్ డి. వినోద్ కన్నా, కె. ప్రవీణ, ఇ. మంజుల తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా భరత్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ 1వ వార్షికోత్సవం

## కాలనీ అభివృద్ధికి అండగా ఉంటా - కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్

**కూకట్‌పల్లి, సెప్టెంబర్ 27 (నమస్తే ఉదయం)**

కూకట్‌పల్లి నియోజక వర్గంలోనీ భరత్ నగర్ కాలనీ రెసిడెన్సి వెల్ఫేర్ అసోసియేషన్ 1వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. సంఘం అధ్యక్షులు పట్టోల్ల నాగిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ బండి రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ కాలనీ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం వెల్ఫేర్ అసోసియేషన్లు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కాలనీ సమస్యలను సమష్టిగా పరిష్కరించుకుంటూ ఐకమత్యంతో ముందుకు సాగాలని, భరత్ నగర్ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ బి.ఆర్ నాగేశ్వరరావు, జనరల్ సెక్రటరీ ఏ. రాజు, ట్రెజరర్ పి. నరేష్ కుమార్, జాయింట్ సెక్రటరీ కె. రాంబాబు గౌడ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ పి. వెంకటేష్, కె. పెదబాబు, డేవిడ్, లలిత, యాదవ్, అపర్ణ చౌదరి తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులు పుష్పారెడ్డి, ప్రతాప్ రెడ్డి, కొండల్ రెడ్డి, అశోక్, శివకుమార్ గౌడ్, శ్రీకాంత్ పటేల్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

# శిశు మందిర్‌లో ఘనంగా పౌర్ణమి యజ్ఞం

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్, 27(నమస్తే ఉదయం):**

శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో భాద్రపద పౌర్ణమి సందర్భంగా పౌర్ణమి యజ్ఞాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ప్రత్యేక యజ్ఞకార్యక్రమాన్ని నిర్వహించగా, బ్రాహ్మణులు అభిషేక్ ఆధ్వర్యంలో యజ్ఞ కార్యక్రమంసంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పాఠశాల కార్యదర్శి కోల అన్నారెడ్డి, ఎలగందుల శ్రీనివాస్,





పులాల శ్యామ్ తదితరులు యజ్ఞంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పౌర్ణమి యజ్ఞం ద్వారా విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలు మరియు ధార్మిక చింతన పట్ల అవగాహన పెంపొందించడమే లక్ష్యమని పాఠశాల ప్రధానాచార్యులు మోరరణధీర్, తెలిపారు. విద్యతో పాటు సంస్కారం, సేవాభావం, దేశభక్తి వంటి విలువలను విద్యార్థుల్లో పెంపొందించేందుకు పాఠశాలలో ఇటువంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గట్టు శ్రీనివాస్, కొత్తూరి ముకుందం, గట్టు రాంప్రసాద్, నడిపెల్లి దీన్ దయాల్ రావు, అప్పిడి వకుళాదేవి, ఎలగందుల సత్యనారాయణ, రాపర్తి శ్రీనివాస్, తాటి రాజేశ్వర్ రావు ఆచార్యులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మబండలో అంగరంగ వైభవంగా వినాయక నిమజ్జన వేడుకలు

**భక్తిశ్రద్ధలతో పాల్గొన్న పట్వారి శశిధర్.. రూ.1.20 లక్షలకు లడ్డూ వేలం**

**ఆల్విన్‌కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్**

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 27 (నమస్తే ఉదయం)**

శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండలో వినాయక నిమజ్జన వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధలు, ఉత్సాహభరిత వాతావరణంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందిరాగాంధీ విగ్రహం సమీపంలో ఎల్లమ్మబండ వినాయక భక్తబృందం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు ఉమ్మడి ఆల్విన్‌కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్వారి శశిధర్, ఆల్విన్‌కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం భక్తబృందం ఆధ్వర్యంలో నిర్వహించిన మహా ప్రసాదం లడ్డూ వేలంపాటలో సీనియర్ నాయకులు కాశీనాథ్ యాదవ్ రూ. 1,20,000లకు లడ్డూను దక్కించుకున్నారు. ఎల్లమ్మబండలో ఈ ఏడాది లడ్డూ వేలంపాట రికార్డు స్థాయిలో జరగడం వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం నిర్వహించిన అదృష్ట బహుమతి కార్యక్రమంలో విజేతలకు బహుమతులను అందజేశారు. మొదటి బహుమతిగా మహా ప్రసాదం లడ్డూను గెలుచుకున్న నవ్యశ్రీకి లడ్డూను అందించి అభినందించారు. రెండో బహుమతిగా విద్యుత్ ద్విచక్ర వాహనాన్ని గెలుచుకున్న నగేష్‌కు వాహనాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి హాజరైన సీనియర్ నాయకులను నిర్వాహకులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం భక్తబృందం ఆధ్వర్యంలో నిర్వహించిన కోలాటం నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పట్వారి శశిధర్‌తో పాటు నాయకులు, భక్తులు, కాలనీవాసులు కోలాటాలను వీక్షిస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. భక్తుల జయజయధ్వానాల మధ్య గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎల్లమ్మబండ ప్రాంతం భక్తులతో సందడిగా మారింది. కార్యక్రమంలో సీనియర్ నాయకులు, వినాయక భక్తబృందం కమిటీ సభ్యులు, కాలనీవాసులు, మహిళలు, భక్తులు, పట్వారి శశిధర్ బృందం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## గోనుపాడులో 'అమ్మకు అక్షరమాల' పరీక్ష

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 27(నమస్తే ఉదయం)**

గద్వాల మండలం గోనుపాడు గ్రామంలో సర్పంచ్ జి. రాములమ్మ అధ్యక్షతన ఆదివారం మహిళలకు 'అమ్మకు అక్షరమాల' పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. చదువుకు వయస్సు అడ్డంకి కాదని, మహిళలు అక్షరాస్యత సాధించి కుటుంబ, సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సత్యమ్మ రాముడు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ గౌడ్, విఓఏ, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.



# కొండా లక్ష్మణ్ బాపూజీ త్యాగం మరువలేనిది

**నేతాజీ కాలనీలో ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి**

**బాపూజీ చిత్రపటానికి నివాళులర్పించిన మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్**




**కూకట్ పల్లి,సెప్టెంబర్ 27 (నమస్తే ఉదయం)**

తెలంగాణ తొలితరం ఉద్యమకారుడు, స్వాతంత్ర్య సమరయోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు శనివారం ఫతేనగర్ డివిజన్ పరిధిలోని నేతాజీ కాలనీలో ఘనంగా జరిగాయి. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఫతేనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ హాజరై బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సతీష్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మంత్రి పదవిని సైతం త్యాగం చేసిన గొప్ప త్యాగధనుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని, చేనేత కార్మికుల అభ్యున్నతి కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. బాపూజీ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మరియు ఫతేనగర్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు కొండ బత్తిని కరుణాకర్, గౌరవ అధ్యక్షులు కోడం వెంకట నరసయ్య, ట్రెజరర్ మత్స్యగిరి శ్రీరాములు, జనరల్ సెక్రెటరీ కంచి బిక్షపతి, వైస్ ప్రెసిడెంట్ పుట్ట సుకృత్ కుమార్, బెతి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



## కేటీదొడ్డి ఆకాశంలో చక్కర్లు కొట్టిన ట్రైనింగ్ ఫ్లైట్లు

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 27(నమస్తే ఉదయం):**

కర్నూలు జిల్లా ఓర్వకల్లు విమానాశ్రయంలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శనివారం ప్రారంభించిన పైలట్ శిక్షణ అకాడమీ (ఓరియంట్ ఫ్లైట్స్ ఏవియేషన్ అకాడమీ) విమానాలు ఆదివారం జోగులాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండల ఆకాశంలో ప్రత్యక్షమయ్యాయి. అకాడమీ ప్రారంభోత్సవం అనంతరం పైలట్ శిక్షణలో భాగంగా విద్యార్థులు నడిపిన చిన్న రకం శిక్షణ విమానాలు కేటీదొడ్డి మండల పరిసర ప్రాంతాల ఆకాశంలో తక్కువ ఎత్తులో పలుమార్లు చక్కర్లు కొట్టాయి. పైలట్ లైసెన్స్ సాధనకు అవసరమైన కనీస ఫ్లయింగ్ అవర్స్ (ఖీశ్రీఅస్త్రష్ట్ర ఎశీబతీం) పూర్తి చేసుకునే క్రమంలో భాగంగా ఈ రూట్‌లో విమానాలను నడిపినట్లు ఏవియేషన్ వర్గాలు తెలిపాయి. సాధారణంగా పెద్ద విమానాలు మాత్రమే చూసే స్థానికులు, ఒక్కసారిగా చిన్న రకం శిక్షణ విమానాలు తమ మండల ఆకాశంలో చక్కర్లు కొట్టడంతో ఆసక్తిగా తిలకించారు. ఓర్వకల్లు అకాడమీ పూర్తి స్థాయిలో అందుబాటులోకి రావడంతో రాబోయే రోజుల్లో కేటీదొడ్డి, గద్వాల పరిసర ప్రాంతాల్లో ఇటువంటి శిక్షణ విమానాలు తరచుగా కనిపించనున్నాయి.



## 100 ఎక్కాలు అవలీలగా చెప్పిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థి అజయ్

**కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఘన సన్మానం**

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 27(నమస్తే ఉదయం)::**

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోరని, సరైన ప్రోత్సాహం అందిస్తే అద్భుతాలు సృష్టిస్తారని జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ కొనియాడారు. మల్దకల్ మండలం పావనం పల్లి గ్రామానికి చెందిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల 5వ తరగతి విద్యార్థి అజయ్, 1 నుండి 100 వరకు గణిత ఎక్కలను ఎంతో అవలీలగా, వేగంగా పూర్తి చేసి అందరినీ విస్మయానికి గురిచేశాడు. విద్యార్థి అసాధారణ ప్రతిభను గుర్తించిన జిల్లా కలెక్టర్, గద్వాల జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో అజయ్‌ను ప్రత్యేకంగా ఆహ్వానించి, ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, అజయ్ లాంటి విద్యార్థుల ప్రతిభే అందుకు నిదర్శనమని అన్నారు. చిన్న వయస్సులోనే 100 ఎక్కాలను తడుముకోకుండా పూర్తి చేయడం అభినందనీయమని హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థిని తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అజయ్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ, విద్యార్థికి అవసరమైన పూర్తి సహకారాన్ని అందిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి తల్లిదండ్రులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.



## రూ.72 వేలకు వినాయకుడి లడ్డూ ప్రసాదం వేలం

**అస్ బెస్టాస్ కాలనీలో ఘనంగా వినాయక నవరాత్రి వేడుకలు**

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 27 (నమస్తే ఉదయం)**

ఆస్బెస్టాస్ కాలనీలో శ్రీ రేణుక ఎల్లమ్మ--నల్ల పోచమ్మ 29వ వినాయక యువజన సంఘం ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన శ్రీ వినాయక స్వామివారి లడ్డూ ప్రసాదం వేలం పాట ఉత్సాహభరితంగా సాగింది. వేలం పాటలో భక్తులు పోటాపోటీగా పాల్గొనగా, మొదటి లడ్డూ ప్రసాదాన్ని తిరుమల ట్రావెల్స్ అశోక్ రూ. 72 వేల ధరకు దక్కించుకున్నారు. అలాగే రెండో లడ్డూ ప్రసాదాన్ని కృష్ణారెడ్డి రూ. 41 వేలతో సొంతం చేసుకున్నారు. లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్న భక్తులను నిర్వాహకులు అభినందించారు. వినాయకుడి ఆశీస్సులు అందరికీ ఉండాలని, కాలనీవాసులు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యువజన సంఘం సభ్యులు, కాలనీవాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేలం పాటను విజయవంతం చేశారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733